www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 5 సెప్టెంబర్ 2024



కందిపప్పు పంపిణీ చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్ : అన్నమయ్య జిలా ఐసిడిఎస్ అన్ని ప్రాజెక్టులలోని అంగన్వాడీ కేంద్రాలకు రెండు నెలలుగా గర్భిణులకు, బాలింతలకు, ప్రీస్కూల్ పిల్లలకు కంది పప్పు అందడం లేదని ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టులో జనవరి నుంచి గర్భిణులకు కందిపప్పు ఇవ్వలేదని పేర్కొన్నారు. పాలు, గుడ్లు, వంటనూనె 15 నుండి 20 రోజుల తేడాతో సెంటర్ లకు వస్తే, సకాలంలో పౌష్టికాహారం అందక పోతే లబ్ధిదారుల గ్రోత్ రేట్ ఎలా పెరుగుతుందని అన్నారు. గర్భిణుల్లో రక్త హీనత ఏ విధంగా నివారిస్తారని ప్రశ్నించారు. సకాలంలో పౌష్టికాహారం పంపిణీ చేయకపోతే ఆరోగ్యవంతులుగా ఉండరని దానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. కొన్ని చోట్ల వర్కర్లను కందిపప్పు ఇవ్వలేదని లబ్ధిదారులు గోల చేస్తున్నారన్నారు. అంగన్వాడీ సెంటర్ అద్దెలు 6 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని, అప్పులు చేసి అద్దెలు కడుతున్నరని అన్నారు. జిల్లా హెడ్ క్వార్టర్‌లో వర్కర్లు అద్దెలతో తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్యాస్, సిబి ఈవెంట్ల డబ్బులు చెల్లించి అంగన్వాడీలకు ఉపశమనం కలిగేలా ఐసిడిఎస్ పీడీ, కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో జోక్యం చేసుకొని కందిపప్పు కొరతతో పాటు పెండింగ్ అద్దెలు చెల్లించాలని కోరారు.



కుక్కలు బాభౌయ్..

జిల్లాలో వీధి కుక్కల స్వైర విహారం ఎక్కువైంది. వీధుల్లో గుంపులుగా ఉంటున్న కుక్కలను చూసి జనం భయపడుతున్నారు. ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. ఏదోఒక చోట రోజూ ఎవరో ఒకరు కుక్క కాటు బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలను బయటకు పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడుతున్నారు. కుక్కల బెడద నివారించేందుకు అధికార యంత్రాంగం నిర్మాణాత్మక చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ప్రాణ సంకటంగా మారింది.

- **గుంపులుగా తిరుగుతున్న శునకాలు**
- **భయాందోళనలో ప్రజలు**
- **ద్విచక్ర వాహనదారుల్లోనూ భయం**
- **మూడు నెలల్లో 1314 మందికి కుక్కకాటు**
- **నియంత్రణ చర్యల్లో యంత్రాంగం విఫలం**

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో కుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. కుక్కలు ఎవరిని పడితే వారిని చిన్న, పెద్ద, ముసలి, ముతక అని తేడా లేకుండా దాడి చేసి గాయపరచడంతో ఆసుపత్రికి పరుగులు తీయాల్సిన పరిస్థితి జిల్లాలో ఏర్పడింది. ముఖ్యంగా వీధులల్లో చిన్నపిల్లలు ఆడుకుంటూ ఉంటారు. అలాంటి వారిపై కుక్కలు ఒకసారిగా దాడి చేసి ముఖం, కాళ్లు, చేతులు, పొట్ట భాగాలపై కరవడం ఘాట్లు పడేలా రాక్కడం రక్తస్రావ గాయాలు పాలు అవుతున్నారు. పిల్లలు ఏడుస్తూ తల్లిదండ్రులకు చెప్పడంతో వారు కుక్కలను వెంటపడి కొట్టే పరిస్థితి వచ్చినప్పటికీ అవి దొరక్కుండా పరుగులు తీస్తూ ఉన్నాయి. పిల్లలు తల్లిదండ్రులు హుటాహుట్టిన బిడ్డలను తీసుకొని ఆస్పత్రికి వెళ్లి కుక్క కాటుకు టీకాలు, గాయాలకు మందులు వేయించుకుని తీసుకొచ్చి బిడ్డలను జాగ్రత్తగా మరో మారు కుక్కల దాడి పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే పలు వీధుల్లో కుక్కలు గుంపులుగా వాహనాలపై వెళ్లే వారిపై అరుస్తూ, దాడులు చేస్తూ పరుగులు తీస్తున్నాయి. ఈ తొందరలో వాహన దారులు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న పలు వాహనాలను ఢీకొనడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారు. కుక్కలు ఎక్కడపడితే అక్కడ వీధుల్లో భారీ సంఖ్యలో గుంపులుగా చేరి వచ్చిపోయే వారిపై అరుస్తూ కరవడం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో రాజంపేట నియోజకవర్గం చిన్న పిల్లల పైన అనేకసార్లు దాడులు చేశాయి.

1314 మందికి గాయాలు

జిల్లా వ్యాప్తంగా జూన్ నెల నుండి ఆగస్టు వరకు 1314 మంది కుక్క కాటుకు గురయ్యారు. అందులో 852 పురుషులు కాగా 462 మంది మహిళలు గాయపడిన వారిలో ఉన్నారు. రాయచోటిలో 603, మదనపల్లెలో 328 మందికి కుక్క కాటు గురయ్యారు. బి.కొత్తకోటలో 25, చిన్నమండెంలో 10, గాలివీడులో ఇద్దరు, గుర్రంకొండలో 8, కలికిరిలో 7, కె.వి.పల్లెలో 21, రైల్వేకోడూరులో 14, కురబలకోటలో 22, లక్కిరెడ్డిపల్లిలో 20, ములకలచెరువులో 15, నిమ్మనపల్లిలో 22, ఓబులవారిపల్లిలో 6, పెద్దతిప్పసముద్రంలో 6, పెద్దమండ్యంలో 8, పెనగలూరులో 21, పీలేరులో 32, రామాపురంలో 10, రామసముద్రంలో 7, సంబేపల్లిలో 5, సుండుపల్లెలో 27, వాల్మీకిపురంలో ఒకరు, వీరబల్లిలో ఇద్దరు కుక్కకాటుకు గురయ్యారు. ఇటీవల కాలంలో గాలివీడు మండలంలో గొర్రెలు, మేకలపై కుక్కలు ముక్కు ముడిగా దాడి చేశాయి. దాడిలో దాదాపు మండలంలో 10 గొర్రెలు మృతి చెందాయి. ఇక చీకటి పడితే పట్టణంలో వేధుల్లో నడుచుకుంటూ వెళ్లాలంటే, వాహనదారులు ఎక్కడ కుక్కలు ఉన్నాయో లే వో చూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీధి లైట్లు లేని ప్రాంతాల్లో కుక్కలు వస్తున్న వారిపై దాడి చేసి గాయాలు పాలు చేస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ జిల్లాలో కుక్కలను అదుపు వేయడంలో సంబంధంత అధికారులు శ్రద్ధ దూపకపోవడం పట్ల పలువురు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కుక్కలు లేకుండా వాటిని పట్టుకు వెళ్ళి దూర ప్రాంతాలకు తరలించి వదిలివేయాలని లేకుంటే ప్రాణాలు, చేతుల్లో పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ పిల్లలు చూసుకో వాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని స్థానికుల, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.





రాయచోటిలో గుంపులుగా ఉన్న కుక్కలు, కుక్కల దాడిలో గాయపడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

రాత్రుల్లో వెళ్లాలంటే భయమేస్తోంది



పట్టణంలో రాత్రి వేలల్లో నడు చుకుంటూ వెళ్లాలంటే కుక్కలతో భయమేస్తోంది. పట్టణంలో ద్విచక్ర వాహనంలో గాని, నడు చుకుంటూ గాని ఒంటరిగా వెళ్లాలంటే కుక్కలు వెంటాడుతున్నాయి. మున్సిపల్ అధికారులు కొన్ని వీధులు మాత్రమే కుక్క లను పడుతున్నారు. పట్టణంలో అన్ని వీధిలో తిరిగి కుక్కలకు టీకాలు వేసి, కుక్కల బెడద లేకుండా చూడాలి.

- చల్లా రెడ్డెయ్య, స్థానికుడు, రాయచోటి.

కుక్కలకు వ్యాక్సిన్ వేస్తున్నాం



జిల్లా వ్యాప్తంగా ప్రజలు కుక్క కాటుకు గురికాకుండా ఉండాలని ఉద్దేశంతో కుక్కలు అన్నింటికీ వ్యాక్సిన్ వేయిస్తున్నాం. పశుసంవర్ధ శాఖ అధికారులతో కూడా ఇటీవల కాలంలో మాట్లాడాం. జిల్లా వ్యాప్తంగా పంచాయతీ సెక్రెటరీలతో మాట్లాడి కుక్కల అన్నింటికీ వ్యాక్సిన్ వేయిస్తున్నాం.

- ఎం.ధనలక్ష్మి, డిపిఒ, రాయచోటి.

టీకాలు అందుబాటులో ఉన్నాయి



జిల్లా వ్యాప్తంగా 58 సిహెచ్‌సి సెంటర్లు ఉన్నాయి. రూరల్ 47, అర్బన్ 11 సెంటర్లు ఉన్నాయి. ప్రతి సిహెచ్‌సి సెంటర్లో ఎఆర్‌వి టీకాలు అందుబాటులో ఉన్నాయి. ఎవరైనా కుక్క కాటుకు వలన గాయాలైతే వెంటనే ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు సూచనల మేర కు టీకాలు వేయించుకోవాలి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- ఎన్.కొండయ్య, డిఎంహెచ్ఒ, రాయచోటి.

'మధ్యాహ్న భోజనం'లో మార్పులు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

పిల్లలందరూ ఇష్ట పడి భోజనం చేసేలా డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంలో (మధ్యాహ్న భోజన పథకం) మార్పులు చేశామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకంపై జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇస్కాన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అన్నమయ్య జిల్లాలో ఇస్కాన్, ఇతర ప్రయివేట్ ఏజెన్సీల ద్వారా అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్నం బడి భోజన పథకంలో ప్రస్తుతమున్న ఆహార మెనూలో సోమవారం నుంచి శనివారం వరకు ఉన్న వివిధ ఆహార పదార్థాల గురించి జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో పోషకాహార లోపాన్ని నివారించడానికి, బడికి వస్తున్న పిల్లల సంఖ్యను పెంచేందుకు, పిల్లల మధ్య సామాజిక బంధాలను మెరుగుపరిచేందుకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన మెనూలో ఏవైనా మార్పులు చేస్తే బాగుంటుందా అని ఇస్కాన్ ప్రతినిధులు, జిల్లాలోని అధికారులను ఉద్దేశించి అడిగారు. దీనికి సమాధానంగా వివిధ మండల విద్యా అధికారులు, పిల్లలు పొంగల్ ం ఇష్టపడడం లేదని దానికి బదులుగా బియ్యంతో చేసిన భోజనాన్ని ఇష్టపడుతున్నట్లుగా తెలిపారు. పథకం అమలులో ఎటువంటి ఇబ్బందులు ఉన్నాయని అడగగా జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ ఇస్కాన్ ప్రతినిధులు వారు చేసిన భోజనాలను హాట్ బాక్స్‌లలో పంపిస్తే బాగుంటుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ సోమవారం నుండి శనివారం వరకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం మెనూలో పెట్టే వివిధ ఆహార పదార్థాలపై కూలంకషంగా చర్చించారు. అన్నం, మిరియాల రసం, వేయించిన గుడ్డు, ఆకు కూర పప్పు, సాంబార్ అన్నం, కందిపప్పు చారు, వివిధ కూరగాయల పప్పు, టమాటా రసము, స్వీట్ పొంగల్, తదితర ఆహార పదార్థాలతో మెనూను సిద్ధం చేశారు. ఈ నూతన మెనూపై కొన్ని వారాల తర్వాత సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్ రెడ్డి, మండల విద్యాధికారులు, ఇస్కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పాలి

పిల్లలందరికీ మంచి విద్యాబుద్ధులు నేర్పాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార మీటింగ్ హాల్‌లో ఐసిడిఎస్ పీడీ, సిడిపిఒలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూపర్‌వైజర్లు పిల్లల కోసం ప్రత్యేక చొరవ తీసుకొని అంగన్వాడీలను సందర్శించి పిల్లలందరూ కేంద్రాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పిల్లలకు మంచి భోజనాన్ని అందించాలన్నారు. హాజరు శాతం పొరపాట్లు ఉన్నాయని పక్కాగా నమోదు చేసి సరైన హాజరును తెలియజేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రీ స్కూలు హాజరు శాతం పెంచడానికి తీసుకోవాల్సిన సూచనలు, సలహాలు సూపర్‌వైజర్లకు వివరించారు. రోజూ అంగన్వాడీ కార్యకర్తలు ప్రీ స్కూలు పిల్లల అటెండెన్స్ ఫొటో, మధ్యాహ్నం మిడ్-డే-మీల్ తింటున్నప్పుడు ఒక ఫొటో, సాయంత్రం ఇంటికి పంపే ముందు ఒక ఫొటో తీసి నోట్ క్యాం యాప్‌లో సూపర్‌వైజర్లకు పంపాలని చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలు ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలని సిడిపిఒను ఆదేశించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ శశికళ, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పంటల సాగులో మెలకువలు పాటించాలి : జెడి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రైతులకు మేలైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడమే పొలంబడి కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ పేర్కొన్నారు. బుధవారం మదనపల్లి మండలం కోళ్లబైలు గ్రామం, మేకలవారిపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి చంద్ర నాయక్ సందర్శించి మాట్లాడుతూ పొలంబడి ద్వారా మేలైన వ్యవసాయ పద్ధతులను రైతులకు తెలియజేశామన్నారు. మెరుగైన వ్యవసాయ పద్ధతులు ద్వారా పండించిన వేరుశనగ పంటను ఇండ్ గ్యాప్ సర్టిఫికేషన్ చేయిస్తామని తెలిపారు. ఈ సర్టిఫికేషన్ పొందిన పంటకు అధిక ధర చెల్లిస్తామన్నారు. ఈ పంటను మదనపల్లిలో మర్యాదరామన్నపట్నం ఎఫ్‌పిఒ ద్వారా కొనుగోలు చేస్తామని చెప్పారు. రైతులందరూ కూడా వ్యవసాయ శాఖ ద్వారా మెరుగైన వ్యవసాయ పద్ధతులను తెలుసుకొని పాటించి అధిక దిగుబడులను సాధించవలసిందిగా కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగ ప్రసాద్, జిల్లా టెక్నికల్ ఎఒలు వెంకట మోహన్, రమేష్ రాజు, మదనపల్లి రైతు సేవా కేంద్రం సిబ్బంది, మదనపల్లి ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, మర్యాద రామన్నపట్నం అమరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు మందులు వితరణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : వైద్య ఆరోగ్యశాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆదేశాల మేరకు విజయవాడ వరద బాధితులకు తమవంతు సాయంగా మదనపల్లి ఔషధ తనిఖీ అధికారి పి.కేశవరెడ్డి నడుంబిగించారు. వెంటనే రంగంలోకిదిగి మదనపల్లెలోని అన్ని మెడికల్ షాప్స్, రిటైల్ అండ్ హోల్‌సేల్ యాజమానులతో మాట్లాడి అన్ని మందులు సమాకూర్చేందుకు శ్రమించారు. సేకరించిన మందులను భద్రంగా ప్యాక్ చేపించి ప్రత్యేక వాహనంలో బుధవారం విజయవాడలోని వరద ప్రభావిత ప్రాంతాలకు ఆ మందులను పంపించారు. వరదలు సమయంలో ప్రజల రోగాలు బారిన పడకుండా వారి ఆరోగ్య పరిరక్షణ కోసం ఏంతో మంది దాతలు ముందుకొచ్చి ఉచితంగా మందులు అందించారు. ఈ సందర్భంగా ఔషధ తనిఖీ అధికారి పి.కేశవరెడ్డి మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల ప్రాణాలను కాపాడటం కోసం మానవత్వాన్ని చాటిన మదనపల్లి రిటైల్ అండ్ హోల్‌సేల్ దుకాణదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీమాంధ్ర డ్రగ్స్ డీలర్స్ అండ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, సత్యనారాయణ మెడికల్స్ నిర్వాహకులు సత్యప్రసాద్ మాట్లాడుతూ వరదల సమయంలో బాధితులకు తాము సైతం అండగా నిలవడానికి అవకాశం కల్పించిన మదనపల్లి ఔషధ తనిఖీ అధికారి పి.కేశవరెడ్డి, కార్యాలయం సిబ్బంది హరినాథ్‌కు అభినందనలు తెలుపుతున్నామన్నారు.



వరద ప్రాంతాలకు తరలిస్తున్న మందులు

వరద బాధితులను ఆదుకుందాం

- ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భారీ వర్షాల కారణంగా సంభవించిన వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఉదారంగా ఆదుకుందామని, తనవంతు సాయంగా రూ.2 లక్షలు అందజేస్తున్నట్లు మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కురిసిన అతి భారీవర్షాలు ఏపీపై పెనుప్రభావం చూపాయన్నారు. కోస్తాలోని పలు జిల్లాల్లో అనేక గ్రామాలు నీట మునిగి, వేలాది మంది ప్రజలు దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ నిరంతరం వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ సహాయక చర్యలు చేపట్టి బాధితులకు భరోసానిస్తున్నారని పేర్కొన్నారు. వారి స్ఫూర్తితో మదనపల్లి నియోజకవర్గం నుండి విరాళాల సేకరించి బాధితులకు అండగా నిలుస్తామన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, ఇది సమంజసం కాదని, రాజకీయాలు చేసే సమయం కాదని హితవు పలికారు. ప్రభుత్వానికి తగు సలహాలు, సూచనలు ఇచ్చి బాధితులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. వైసిపి పాలనలో ఏనాడు తాడేపల్లి ప్యాలెస్ వదిలి రాని జగన్ విజయవాడ నగరంలో ఎక్కడా కనీస సౌకర్యాలు కల్పించలేదని విమర్శించారు. వైసిపి నాయకుల మితిమీరిన ఆక్రమణల వల్లే ఇలాంటి పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయని ఆరోపించారు. సబ్ కలెక్టర్ కార్యాలయం ఘటనను ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తప్పుదోవ పట్టించే విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. కబ్జాలు ఆక్రమణలు ఎవరు చేశారో అనే దానికి 2024 ఎన్నికల ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ఇది విమర్శలు చేసుకునే సమయం కాదని పేర్కొన్నారు. వరదలతో సర్వం కోల్పోయిన వారికి రాజకీయాలకు అతీతంగా ఆపన్న హస్తం అందిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ గుర్రప్ప నాయుడు, నవీన్ చౌదరి, నాగూర్ వలి, షంషీర్, యర్రబల్లి వెంకటరమణారెడ్డి, తమ్మిశెట్టి రామకృష్ణ, కంచర్ల మల్లికార్జున నాయుడు, రాటకొండ శ్రీనివాసులు నాయుడు, రామిశెట్టి కృష్ణ, కత్తి లక్ష్మన్న, వేణు, జెసిబి మధుసూదన్ రెడ్డి, విజయమ్మ, జీవి నాయుడు, బీదం గురునాథ్ యాదవ్, ప్రభాకర్, రెడ్డి రాయల్స్, అన్వర్ బాషా, మడితం రమణ, ఎంపిటిసీ దేవేంద్ర, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో గురువులే కీలకం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దేది గురువులేనని ఎబిసి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి పేర్కొన్నారు. బుధవారం స్థానిక నీరుగట్టువారిపల్లెలోని సాయి విద్యానికేన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ముందుగా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఎబిసి ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి ఆధ్వర్యంలో సాయి విద్యానికేతన్ కరెస్పాండెంట్ మోడెం శ్రీనివాసరావు అధ్యక్షతన ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరాచారి మాట్లాడుతూ అజ్ఞానాన్ని తొలగిస్తూ విజ్ఞానాన్ని పంచే గురువులందరికీ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రతి విద్యార్థి విద్య నేర్పిన గురువులను జీవితకాలం గుర్తుంచుకొని, గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. గురువులు తమ పిల్లలను పక్కన పెట్టి, విద్యార్థులనే తమ సొంత పిల్లలుగా భావిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తు కోసం వారి జీవితాలను ధారపోస్తారన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని, నివాళులర్పిస్తూ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన ఆశయాల సాధనకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం కరస్పాండెంట్ మోడెం శ్రీనివాసరావు మాట్లాడుతూ సమాజంలో తల్లితండ్రులు తర్వాత పిల్లలపైన ప్రభావితం చూపేది ఉపాధ్యాయులేనన్నారు. చదువు నేర్పే ఉపాధ్యాయులను ప్రతి విద్యార్థి గౌరవించడం నేర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి జీవితానికి ఒక ఉపాధ్యాయుడు మార్గదర్శకంగా ఉంటారని, విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ఉజ్వల భవిష్యత్తును అందుకోవడమే ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవమని పేర్కొన్నారు. అనంతరం ఎబిసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీనివాసరావును పాఠశాలలో విద్యను బోధించే ఉపాధ్యాయులను శాలువ స్వీట్ బాక్సులు అందించి, గౌరవంగా సన్మానించారు. దీనిపై శ్రీనివాసరావు స్పందిస్తూ, ఎబిసి ఫౌండేషన్ అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రెడ్డెప్ప, ఉపాధ్యాయులు లక్ష్మి, నౌజియా, చాముండి, శ్రీదేవి, ప్రవళిక, పుష్ప, హైమావతి, మంజుల, లలిత, బిలాల్, మూర్తిలతో పాటు ఇతర ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సురేష్‌కు గురు విశిష్ట పురస్కారం

నేటి సమాజంలో ఆడబిడ్డలపైన జరుగుతున్న అవమాన ఘటనల నుంచి ఆడబిడ్డలు రక్షించుకోవ డానికి ఆత్మరక్షణ విద్య ఒక్కటే శరణ్యం అంటూ ఉచిత ఆత్మరక్షణ విద్యలో శిక్షణ ఇస్తూ తనకు ఉన్నంతలో పేదలకు సేవ చేస్తూ పలువురి మన్ననలు పొందిన గ్రాండ్ మాస్టర్ డాక్టర్ ఎ.ఆర్.సురేష్ ఎన్నో ఉత్తమ పురస్కారాలకు అర్హుడని పలువురు కొనియాడారు. తిరుపతి వేదికగా రేవతి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డి.జి.రామమూర్తి, ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు తహసున్నీసా బేగం సంయుక్త ఆధ్వర్యంలో మేక్ మై బేబి జీనియస్ స్కూల్లో నిర్వహించిన ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలల్లో ఉత్తమ గురువులకు శ్రేష్ట విశిష్ట పురస్కారాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మదనపల్లె యూత్ కరాటే అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్ చేసిన సేవలకు తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య చేతులమీదుగా శ్రేష్ట విశిష్ట గురు పురస్కారంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతి మండల విద్యాధికారి కె.బాలాజీ, సంగరాజు భాస్కర్ రాజు, దర్శకుడు, మేక్ మై బేబీ జీనియస్ స్కూల్ కొక్కంటి ఈశ్వరయ్య, వప్రసన్న భారతి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్, జి.వీరశంకర్, డాక్టర్ డి.సి.నారాయణ స్వామి, సి.వి.గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎఎస్‌పి రాజశేఖర్‌రాజు

ఎఎస్‌పిగా రాజశేఖర్‌రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రాయచోటిటౌన్

అన్నమయ్య జిల్లా నూతన అదనపు ఎస్‌పిగా(అడ్మిన్)గా ఎస్.ఆర్. రాజశేఖర్ రాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. తూర్పుగోదావరి జిల్లాలో అదనపు ఎస్‌పిగా విధులు నిర్వర్తిస్తున్న అయన్ను సాధారణ బదిలీల్లో భాగంగా అన్నమయ్య జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు సూచనల మేరకు పోలీసు సిబ్బందికి సంబంధించి పెండింగ్ ఫైళ్లను వేగంగా పరిష్కరిస్తామన్నారు. శాంతిభద్రతల విషయంలోనూ ఎలాంటి సమస్యలు తలెత్తినా తగిన చర్యలు చేపడతామన్నారు. పరిపాలన పరంగా కార్యాలయంలో ఉద్యోగరీత్యా ఎటువంటి సమస్య ఉన్నా ఎస్‌పి దృష్టికి తీసుకెళ్ళి సిబ్బంది సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. సిబ్బంది, వారి కుటుంబ సంక్షేమం పై దృష్టి సారిస్తామని అన్నారు. ఈయన గతంలో కడప-కర్నూలు ఉమ్మడి జిల్లాలలో ఎస్ఐగా, సిఐగా, డిఎస్‌పిగా పనిచేసి సమర్థవంతమైన అధికారిగా , ముఖ్యంగా ప్యాక్షణ అణచివేతలో పేరున్న అధికారిగా అటు ఉన్నతాధికారులతో పాటు ప్రజల మన్ననలు పొందారు. పోలీసు ప్రధాన కార్యాలయంలో పలువురు పోలీసు అధికారులు, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు.

సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు

ప్రజాశక్తి-మదనపల్లి : కురబలకోట మండలంలోని గోల్డెన్ వ్యాలీ విద్యా సంస్థలలో సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు చైర్మన్ ఎన్.వి.రమణారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థలలో పనిచేస్తున్న సిబ్బంది విద్యార్థినుల పట్ల తప్పుగా ప్రవర్తించారని ఆరోపణలు ఉన్న పిఇటి వై.తరుణ్ అనే ఉద్యోగిని 10 రోజుల క్రితం విధుల నుండి తొలగించామని తెలిపారు. ఈ విషయంగా సంస్థపై కుట్ర కోణం కారణంగా కాంట్రాక్ట్ సిబ్బంది ఎం.శ్రీలత, ఎం.ఎ.సతీష్‌లను కూడా విధుల నుండి తొలగించామని తెలిపారు. సంస్థలో విద్యార్థినులపై అగౌరవంగా ప్రవర్తిస్తే ఇటువంటి ఖఠిన చర్యలు తీసుకొంటామని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-పీలేరు : మండలంలోని రామానాయక్ తాండాలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని గూడరేవుపల్లి పంచాయితీ, రామానాయక్ తాండాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తమ సిబ్బందితో కలిసి ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మలేరియా అధికారి విద్యాసాగర్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మలాథియన్ ద్రావణం ప్రత్యేక సాధనం ద్వారా దోమల నియంత్రణ నిమిత్తం పిచ్చికారి చేయించారు. పారామెడికల్ సిబ్బంది సహకారంతో ఇంటింటికీ తిరిగి దోమలు పెరిగే ప్రాంతాలను గుర్తించి లార్వా నిర్మూలన చర్యలు చేపట్టారు. డాక్టర్ చంద్రశేఖర్ వ్యాధులు నియంత్రణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గూర్చి ఆరోగ్య విద్య కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసులు, ఎఎన్ఎం పాముస్నిసా, వెంకటరత్నం, సిహెచ్ఒ లావణ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



మధ్యాహ్నం భోజన పథకాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

ప్రజాశక్తి-కలకడ

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్‌వి.కిషోర్‌కుమార్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. మండలంలోని కదిరాయచెరువు ప్రాథమిక పాఠశాలను సందర్శించినట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యాధులపై అవగాహన కల్పించి ఆరోగ్య సూత్రాలు తెలిజేసినట్లు చెప్పారు.తాజా ఆకుకూరలు, కూర గాయలు, పాలు, గుడ్లు, తృణధాన్యములు, అధిక మాంసకృతులు, ప్రోటీన్లు, కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించినట్లు పేర్కొన్నారు. వారికి ఇచ్చే మధ్యాహ్నం మెనూ పరిశీలించి రుచి చూడడం జరిగిందని తెలియజేశారు. మొత్తం హాజరైన పిల్లల సంఖ్య 44 మంది పిల్లలు ఉన్నారని, వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశామన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించగా అక్కడ 11 మంది పిల్లలు ఉన్నారని, పిల్లలకు అందించే పౌష్టి కాహారాన్ని తనిఖీ చేసినట్లు చెప్పారు. ప్రతి గురువారం పంపిణీ చేసే ఐరన్ టాబ్లెట్ల రికార్డులను పరి శీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ జయరామయ్య, ప్రధానోపాధ్యాయులు సి.నూరుల్లా, హెల్త్ సూపర్వైజర్ బి.రెడ్డమ్మ, ఆరోగ్య కార్యకర్తలు ఆర్.శివకు మార్‌బాబు, శ్రీ.లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.లావణ్య, డేటా ఎంట్రీ రోజా, పైలెట్ రమేష్‌బాబు, అంగన్వాడీ కార్యకర్త సి.జ్యోతి, ఆశా కార్యకర్తలు ఎం.సుజాత, బి.కుమారి పాల్గొన్నారు.

24న విభిన్నప్రతిభావంతులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని విభిన్నప్రతిభావంతులకు స్థానిక ఎస్‌బివిడి సభ ప్రాంగణంలో 24న విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాల కోసం పరీక్షలు నిర్వహించబడునని జిల్లా దివ్యాంగుల సూపర్వైజర్ అనిల్ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24న మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించ బడునని తెలిపారు. ఈ పరీక్షలకి హాజరయ్యే విభిన్న ప్రతిభావంతులకు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు తప్పకుండా తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ చక్కటి అవకాశాన్ని మండల పరిధిలోని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.. కార్యక్రమంలో మండల ఇఒపిఆర్ పెంచలయ్య, పంచాయతీ కార్యదర్శి ముత్తయ్య, ఐఇడి విజయ్ కుమార్, సునీత, మహేష్ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-నందలూరు

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులను సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సుచిత్ర పేర్కొన్నారు. మండలం లోని పాటూరు పంచాయతీ కుమ్మరపల్లి గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం అధికారులు బుధవారం పర్యటించి గ్రామసభ నిర్వహించారు. రైతులకు వరి పంటలో తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. కడప కెవికె నుంచి వ్యవసాయ శాస్త్రవేత్త వీరయ్య వరి పంటను పరిశీలించి పాము పొడతెగులు నివారణకు సూచనలు అందించారు. కార్యక్రమంలో ఎఒ మల్లికార్జున, పాటూరు రైతు సేవా కేంద్రం ఎంపిఇఒ సాయిప్రియ, కుమ్మరపల్లి గ్రామ రైతులు, పాల్గొన్నారు.

'అన్నమాచార్య'లో జాతీయ పోషకాహార దినోత్సవం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత ఆధ్వర్యంలో బుధవారం జాతీయ పోషకాహార దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆరోగ్యాన్ని పెంపొందించే ఆహార వంటకాలు స్వయంగా తయారు చేశారు. మధుమేహ వ్యాధి, రక్తపోటు వ్యాధి నివారణకు, బరువు నియంత్రణకు, కొలెస్ట్రాల్ తగ్గించుటకై వివిధ రకాల పోషకాహారాలు తయారుచేసి కళాశాలలో ప్రదర్శించారు. రాగి వడ, బీట్రూట్ లడ్డు, పీనట్ మిల్క్ షేక్, రాగి సంగటి, ఫ్రూట్ సలాడ్, వెజిటేబుల్ సలాడ్, క్యారెట్ హల్వా వంటి ఆహార పదార్థాలు తయారుచేసి ప్రదర్శనలో విద్యార్థులు అధ్యాపక బృందానికి మరియు తోటి విద్యార్థులకు తక్కువ ధరకు అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ పి.ద్వారకనాథ్ రెడ్డి, వై.ప్రదీప్ కుమార్, డాక్టర్ ఎం.ప్రమోద్ కుమార్, డాక్టర్ పి.అనిత, డాక్టర్ వాసవి దేవి, డాక్టర్ ఎం.శిరీష తదితర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల దళవాయిపల్లిలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రమణ పిల్లలలో సృజనాత్మకతను పెంచేలా విద్యా బోధన చేస్తున్నారు. 5వ తరగతి పరిసరాల విజ్ఞానంలో మన అవవయ వ్యవస్థ పాఠం బోదనలో భాగంగా అవయవ వ్యవస్థలను స్థానిక వనరులతో పిల్లలచే చేయించిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది.అగ్గి పుల్లలతో అస్థి పంజరం, వివిధ దినుసులతో జీర్ణ వ్యవస్థ, బీన్స్‌తో మూత్రపిండాలు, బెలూన్స్, స్ట్రాలతో ఊపిరితిత్తులు, ఉన్ని దారాలతో నరాల వ్యవస్థను పిల్లలు తయారు చేసిన తీరు అందరిని అలరించింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రమణ మాట్లాడుతూ పిల్లలకు ఎప్పుడు మూస ధోరణిలో కాకుండా ఇలా నమూనాలు పిల్లలచేత చేయిస్తూ పాఠం చెపితే సులభంగా అర్థం అవుతుందని అన్నారు. చాలా కాలం గుర్తు ఉంటుందని, పిల్లలు కూడా రెట్టింపు ఉత్సాహం చూపిస్తున్నారని అన్నారు

సిఎస్ఇ విద్యార్థులకు టెక్నికల్ ఇంటర్వ్యూలపై అవగాహన

ప్రజాశక్తి-మదనపల్లి



మాట్లాడుతున్న పాల్‌జోసెఫ్

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూ టర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం వారు గెస్ట్ లెక్చర్‌ను కోడ్ క్రాకింగ్, టెక్నికల్ ఇంటర్వ్యూల కోసం నిపుణుల వ్యూహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి నట్లు ప్రిన్సి పల్ డాక్టర్ యువరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి, రిసోర్స్ పర్సన్ గా జె.పాల్‌జోసెఫ్, పాల్గొన్నాంని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్‌కు కోడింగ్ చాలా అవసరం అన్నారు. అప్లికేషన్‌లు, వెబ్‌సైట్‌లు, డేటాతో ఇంటరాక్ట్ అయ్యే, అల్గారిథమ్‌లను అమలు చేసే ఆటోమేటెడ్ టాస్క్‌లను నిర్వహించే ఇతర డిజిటల్ సాధనాలను రూపొందించడానికి కోడింగ్ ప్రోగ్రామర్ చాలా అవసరమని అన్నారు. ప్రతి ప్రోగ్రామర్‌కు కోడింగ్ ఇంప్లిమెంటేషన్ చాలా అవసరమని చెప్పారు. సమాచార సాంకేతికతకు వెన్నెముకగా పరిగణించబడుతున్న కోడింగ్ వెబ్ అభివృద్ధి, వివిధ సాంకేతిక పరిష్కారాలలో కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీదేవి, గీత, వసుంధర పాల్గొన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- ఇష్టానుసారంగా చెట్లు నరికివేత
- పర్యావరణానికి తూట్లు పొడుస్తున్న వ్యాపారస్తులు
- అధికారుల పర్యవేక్షణ లోపమా లేక మామూళ్ల మత్తా ?
- అక్రమ కలపను సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు



నిమ్మనపల్లెలో పట్టపగలే కలప రవాణా



నల్లంవారిపల్లె వద్ద రవాణాకు సిద్ధంగా ఉంచిన కలప

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణం పరిరక్షణకు, మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్య తను కల్పిస్తోంది. మదనపల్లె నియోజకవర్గంలో కూడా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కూడా ప్రతి ఆదివారం మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నిమ్మనపల్లె మండలంలో మాత్రం అందుకు భిన్నంగా కలప అక్రమ వ్యాపారస్తులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. వెంగం వారిపల్లె, నిమ్మనపల్లె, తవళం గ్రామాలలో ఇష్టానుసారంగా చెట్లను నరికి మదనపల్లె, వాల్మీకి పురం, కలికిరి, చింతపర్తి తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు కానీ అటవీశాఖ అధికారులు కానీ కలప అక్రమ రవాణాను అరికట్టలేక పోతున్నారు. వివరాల్లోకి వెళితే..వెంగంవారిపల్లె గ్రామంలోని నల్లంవారిపల్లె, మండ్యం వారిపల్లె వద్ద కొంతమంది కలప అక్రమ రవాణా వ్యాపారస్తులు విలువైన చెట్లను నరికి రవాణా చేయడానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం తారసపడింది. ప్రతిరోజూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా కలప అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఇంత బహిరంగంగా చెట్లను నరికివేస్తున్న, రవాణా చేస్తున్న రెవెన్యూ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహ రిస్తున్న తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతులు ఎవరికీ ఇవ్వలేదు

వెంగంవారిపల్లె గ్రామంలో చెట్లు నరికివేతపై ఎవ్వరికి అనుమతులు ఇవ్వలేదు. గ్రామంలో కలప అక్రమ రవాణాపై విఆర్‌ఎ కానీ, స్థానికులు కానీ తమ దృష్టికి తీసుకురాలేదు. అక్రమంగా చెట్లను నరికి రవాణా చేస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వ్యాపారస్తులు నరికిన కలపను స్వాధీనం చేసుకున్నాం.

-వసంత కుమారి, విఆర్‌ఒ.

అక్రమ కలపను సీజ్ చేస్తాం

వెంగంవారిపల్లె గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా వ్యాపారస్తులు చెట్లను కోసిన సమాచారం తమ దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధించి రెవెన్యూ అధికారుల ద్వారా కోసిన కోయ్యలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి అటవీశాఖ అధికారులకు అప్పగించాం. అక్రమంగా చెట్లను కోసేవారిపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా చెట్లను నరికివేస్తుంటే స్థానికులు కూడా తమకు సమాచారం అందించాలి.

-ధనుంజయులు, తహశీల్దార్.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

-డాక్టర్ మల్లికార్జునస్వామి



ప్రజాశక్తి-సుండుపల్లి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ కెవిఎస్.మల్లికార్జునస్వామి పేర్కొన్నారు. మడితాడు గ్రామపంచాయతీలోని జికె.రాశిపల్లి మెయిన్ రోడ్డు పక్కన మల్లి ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ మల్లికార్జున సీజన్ వ్యాధులపై ప్రజాశక్తితో మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు అందించారు. తాగునీరు కలుషితం కాకుండా కాచి చల్లార్చి వడపోసుకొని తాగాలన్నారు. గోరువెచ్చని నీటిలో కొద్ది ఉప్పు వేసుకొని నోటిని శుభ్రం చేసుకోవాలని చెప్పారు. చేతికి గోర్లు పెరగకుండా చూసుకోవాలని, చేతులను తరచుగా శుభ్రంగా చేసుకోవాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటిని, పరిసరాలను ప్రతిరోజూ శుభ్రం చేసుకోవాలని చెప్పారు. ఇంటిలోని నీటి తొట్టెలు, ఎయిర్ కూలర్లు, టైర్లు, టెంకాయ చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, వేప ఆకు పొగ వేసుకొని దోమలను నియంత్రించాలన్నారు. దోమల ద్వారానే మలేరియా, డెంగీ వంటి విష జ్వరాలు వస్తాయని, పగటి పూట దోమలు కుట్టకుండా జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. జ్వరం, జలుబు, దగ్గు వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రిలో చికిత్స చేయించుకోవాలని తెలిపారు. రెండు రోజులకు మించి జ్వరం వస్తుంటే రక్తపరీక్షలు చేయించుకొని వ్యాధి నిర్ధారణ చేసుకొని తగిన మందులను వాడాలని పేర్కొన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చోట మాస్కులు ధరించాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉంటామని ఆయన తెలిపారు.

మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకుందాం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వినాయక చవితిని దృష్టిలో ఉంచుకొని పట్టణంలోని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మట్టి వినాయకులను ప్రోత్సహించడంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ వినాయక చవితికి పూజించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లు తుందని, చెరువులు, నదులు కలుషితమవుతున్నాయని అన్నారు. దానిని నివారిం చడానికి మట్టి విగ్రహాలు కొని లేదా స్వంతంగా చేసి పూజించవచ్చని తెలిపారు. ఈ సంస్కృతిని ప్రోత్సహించడానికి విద్యార్థులలో చైతన్యం తీసుకురావడానికి మట్టి విగ్రహాల తయారీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎకో ఫ్రెండ్లీ క్లబ్ కన్వీనర్ జి.కుసుమ ప్రియ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు సూర్య శేఖర్ రెడ్డి, సుబ్బారాయుడు, గురుమూర్తి, విష్ణు ప్రియ, నమ్రత, జ్యోతి, మోహన వల్లి, హాజీరా ఖానం తదితరులు పాల్గొన్నారు.

రేపు మట్టి విగ్రహాలు పంపిణీ

రాయచోటి : వినాయక పండుగను పురస్కరించుకొని రాయచోటి మానవత శాఖ చైర్మన్, ప్రతిభా జూనియర్ కళాశాల కరస్పాండెంట్ అరమాటి శివగంగి రెడ్డి శుక్రవారం పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలతో పాటు చెక్ పోస్ట్ శివాలయం దగ్గర వినాయక మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ అవకాశాన్ని రాయచోటి ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ కూడా మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు.

గణేష్ మండపాలకు అనుమతి తప్పనిసరి : సిఐ

వాల్మీకిపురం: మండలంలోని 16 పంచాయతీల్లో వినాయక చవితి సందర్భంగా గణేష్ మండపాలు ఏర్పాటు చేసే వారు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని వాల్మీకిపురం సిఐ ప్రసాద్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. https://ganeshutsav.net ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని, లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించవచ్చునని సూచించారు. వినాయక చవితి మండపాల వద్ద ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌లు, గలాటాలు, దొంగతనాలు జరగకుండా నిర్వాహకులు బాధ్యత వహించాలన్నారు. నిర్వాహకులు రాత్రి సమయాల్లో మండపాల వద్ద నిద్రపోవాలని, సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు ఏలాంటి అంతరాయం కలిగించకుండా చూడాలన్నారు. బాణా సంచా కాల్చడం, డీజేలు ఉపయోగించడం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదర్శనీయ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-చిట్వేలి



సిఎం నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లు(ఫైల్ ఫొటో)

మండల పరిధిలోని చిట్వేలి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కామటం వెంకటేశ్వర్లు ఉత్తమ విద్యాభోదనతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తు న్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. తన సొత ఖర్చుతో విద్యా సామగ్రి అందించి మెరుగైన విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని కొనియాడారు. గతంలో కూడా గిరిజన కాలనీలో విద్యార్థులు ఉన్న పాఠశాల లేకపోవడంతో సొంతంగా నిరుద్యోగులుగా ఉన్న వారిని ఉపాధ్యాయులుగా నియమించి ఆయనే జీతం ఇచ్చి నడిపించేవారని అన్నారు.సేవా భావంతో ఉన్న ఆ ఉపాధ్యాయుడిని అన్నయ్య సార్‌గా పిలుచుకుంటున్నామని అన్నారు. ఆయన సేవాభావానికి ఎన్నో అవార్డులు వచ్చాయని తోటి ఉపాధ్యాయులు తెలిపారు. స్వాతంత్ర స్వర్ణోత్సవ వ్యాసరచన పోటీల్లో బంగారు పత్రం, 2008, 2001 జనాభా లెక్కల సేకరణలో భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ సైన్సెస్ ఆఫ్ ఇండియా వెండి పతకం ప్రశంస పత్రం, 2009లో మండల స్థాయి మేళాలో ప్రశంసా పత్రం, 2010లో సెప్టెంబర్ ఐదున జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 2012లో సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ సంక్షేమ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పురస్కారం అందుకున్నారని అన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్న అందరి అభిమానం పొందుతున్నారని అన్నారు.

రేపు మంత్రులు 'ఆనం', 'మండిపల్లి' రాక

ప్రజాశక్తి-గాలివీడు : రామాయణ మహారాజ గోపురం ప్రారంభోత్సవానికి శుక్రవారం దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వస్తున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ తెలిపారు. శుక్రవారం తహశీల్దార్ భాగ్యలత సమావేశమై చర్చించారు. ఇఒ కొండారెడ్డి, టిడిపి నాయకులు కొండ్రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మోడం చిన్నయ్య పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి : ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని మెనూ మేరకు విద్యార్థులకు వడ్డించాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎంఇఒ-1 త్యాగరాజులు తెలిపారు. బుధవారం వారు ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి, రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన పథకం రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సురేంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసులో ఐదుగురు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ



అరెస్టు అయిన నిందితులను చూపుతున్న పోలీసులు

యువకుడి హత్య కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు సిఐలు గురునాథ, ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని కోన పంచాయతీ తిప్పిగారిపల్లికి చెందిన భోజనపు వెంకటరమణ కుమారుడు భోజనపు సాంబశివ(40) ప్రయివేట్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ తన భార్య నాగరాణి కుమారుడు, ఇద్దరు కుమార్తెలతో జీవనం సాగిస్తున్నాడని చెప్పారు. ఈ క్రమంలో మృతుడు సాంబశివకు అక్క నాగవేణి, మామ రెడ్డెప్పలు మదనపల్లెలో కాపురం ఉన్నారని తెలిపారు. వీరికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నట్లు తెలిపారు. నాగవేణి రెడ్డప్పల పెద్ద కుమార్తె మమత మదనపల్లికి చెందిన వడ్డెర కులానికి చెందిన పూజారి జగదీష్ ను ప్రేమించి పెళ్లి చేసుకున్నట్లు తెలిపారు.సాంబశివ మామ రెడ్డప్ప కేన్సర్ వ్యాధితో బాధపడుతూ అనారోగ్యానికి గురి కావ డంతో అతడిని బెంగళూరుకు చికిత్స నిమిత్తం తీసుకుపోవడం, తీసుకురావడానికి సాంబశివ చొరవ తీసుకోవడంతో అది జీర్ణించుకోలేని మమత భర్త జగదీష్ మృతుడు సాంబశివపై కక్ష పెంచుకున్నారని తెలిపారు. ఎలాగైనా సాంబశివను హతమార్చి తనకు అడ్డు లేకుండా చేసుకోవాలని జగదీష్ నిర్ణయించుకున్నట్లు తెలిపారు. సాంబశివను అడ్డు తొలగించుకునే క్రమంలో మదనపల్లి సమీపంలో ఉన్న మిట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులతో ఆరు లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఆగస్టు 24న సాంబశివను కర్ణాటకకు విహారయాత్రకు బాడుగకు కారుకవాలని ఫోన్ చేసి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం 24 నుంచి 26వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలో ఉన్న జోగ్‌ఫాల్స్‌కు తిరిగి అక్కడ నుంచి 26న సాయంత్రానికి కర్ణాటక రాష్ట్రంలోని హొన్నవరం-బెంగళూరు హైవేలోని శరావతి వ్యాలీ వ్యూ పాయింట్ వద్ద ఉన్న అటవీ ప్రాంతానికి సాంబశివుని తీసుకెళ్లి కర్రలు, రాళ్లతో కొట్టి హత్య చేసినట్లు తెలిపారు. గత నెల 28న తన భర్త ఇంటికి రాకపోవడంతో సాంబశివ భార్య నాగరాణి స్థానిక పోలీసులకు భర్త ఆచూకీ తెలపాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు కలకడ, వాల్మీకిపురం సిఐలు గురునాథ, ప్రసాద్‌బాబు, కలకడ, కెవి.పల్లి ఎస్‌ఐలు రామాంజనేయులు, రహీముల్లాలు కలసి దర్యాప్తు ముమ్మరం చేశామని చెప్పారు. సాంబశివని హత్య చేసిన మదనపల్లికి చెందిన పూజారి రామకృష్ణ కుమారుడు జగదీష్, గోటూరి వేమ నారాయణ కుమారుడు ఆంజనేయులు, తమ్మిశెట్టి నాగేశ్వర కుమారుడు సోమశేఖరు, మైనర్ ను అదుపులోకి తీసుకొని వారి నుంచి మృతుడి కారు, రూ. 1350 నగదును స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. అనంతరం హత్యకు గురైన సాంబశివ మృతదేహాన్ని కర్ణాటకలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

జాతీయ లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

సివిల్, క్రిమినల్ కేసులపై జాతీయ లోక్‌అదాలత్‌లో సమస్యలు పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాదికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్, లక్కిరెడ్డిపల్లి సివిల్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి షేక్ పైజున్నిసాలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కోర్టులో లక్కిరెడ్డిపల్లి, రామాపురం, గాలివీడు పోఈసు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనె 14న జాతీయ లోకాదలత్ జరుగుతుందని, ఈ కార్యక్రమంలో క్రిమినల్, సివిల్,ఇతర కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాలు, మొండి బకాయిల గురించి లోకాదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల ఎస్ఐలు, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గురుకులంలో వనమహోత్సవం

ప్రజాశక్తి-రామాపురం

పాఠశాలను క్లీన్ గ్రీన్ గురుకులంగా మార్చుకుందామని ఎంపిడిఒ సూర్యనా రాయణరెడ్డి పేర్కొన్నారు. స్థానిక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణంలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా బుధవారం వంద మామిడి, ఉసిరి , సపోటా, నేరేడు వంటి పండ్ల రకాలు, వేప, చింత వాటితో పాటు పూల రకాల మొక్కలు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ వరప్రసాద్ తో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడంతోపాటు వాటిసంరక్షణ ముఖ్యమని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మురళీధర్‌రాజు, ప్లాంటేషన్ సూపర్వైజర్ మురళీ, టెక్నికల్ అసిస్టెంట్ నాగభూషణం, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-బి.కొత్తకోట

విద్యార్థులు క్రీడల్లోనూ సత్తా చాటి మండల ప్రతిష్టను పెంచాలని పట్టణంలోని విద్యార్థి హైస్కూల్ కరస్పాండెంట్ ఆకాంక్షించారు. క్రికెట్ క్రీడ పట్ల ఆసక్తి ఉన్నవారి ప్రతిభను వెలికి తీసేందుకు క్రికెట్ టోర్నీ నిర్వహించి విన్నర్స్, రన్నర్స్ టీంలకు నగదు బహుమతులను అందించారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విన్నర్స్ టీం కెప్టెన్ సయ్యద్‌కు రూ.25 వేలు, రన్నర్స్ టీం కెప్టెన్ సందీప్‌కు రూ.10వేలు నగదును అందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారులు తమకు అంది వచ్చిన అవకా శాలను చక్కగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రికెట్ టోర్నమెంటులో తమ ప్రతిభను చాటి జిల్లా, రాష్ట్ర జట్లకు ఎంపిక కావాలని అన్నారు. మండలానికి, నియోజక వర్గానికి మంచి పేరు తెచ్చి పెట్టాలని పిలుపునిచ్చారు. టోర్నమెంటులో క్రీడాకారులు అద్భుత ప్రదర్శన చేశారని కొనియాడారు.

'శ్రీసాయి' విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ మేనేజ్మెంట్ (ఎంబిఎ) విద్యార్థులు, యూనివర్సిటీ విడుదల చేసిన ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపరిచి యూనివర్సిటీ స్థాయిలో అత్యధిక ఉత్తీర్ణత సాధించారని శ్రీ సాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.సి. శ్రీ వర్షిత 82.75 శాతంతో మొదటి ర్యాంకు, ఎస్. సుహాన 81 శాతంతో రెండవ ర్యాంకు, ఎస్.ఆస్మా, వి.భార్గవి, పఠాన్ ముబారక్ 80.62 శాతంతో మూడవ ర్యాంకు సాధించి యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. వారి ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను అభినందిస్తూ, ప్రతి ఒక్కరికీ ఉద్యోగ ఉపాధి భరోసా కల్పించడానికి మౌలిక వసతులు కల్పిస్తున్నామని వివరించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని మిగిలిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని దిశానిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని అంకితభావంతో కృషి చేయాలని, క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థానాన్ని అధిరోహించాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. బాలాజీ, ఎంబిఎ విభాగాధిపతి కొత్తపల్లి ఇంతియాజ్, వివిధ విభాగాల అధిపతుల, అధ్యాపకులు, అభినందించారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ప్రజాశక్తి- బి.కొత్తకోట

పిటిఎం మండలం,మద్దయ్యగారిపల్లి పంచాయతీ కేంద్రంలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపిడిఒ కెఎన్.బాలాజీ లబ్ధిదారులకు తెలిపారు. పంచాయతీ విస్తరణ అధికారి యోగానంద, పంచాయతీ కార్యదర్శి సుమలత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ముస్తఫాలు లతో కలిసి లబ్ధిదారులతో మాట్లాడారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ ఎఇ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో గృహ నిర్మాణ లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని వారికి సూచించారు. గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరై కొంతవరకు నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులు తిరిగి నిర్మాణాలను పునఃప్రారంభిం చాలన్నారు .ప్రస్తుతం ప్రభుత్వం మారిన సకాలంలో బిల్లులు మంజూరు అవుతా యని తెలి పారు. లబ్ధిదారులు శరవేగంగా సొంతింటి కలను సాకారం చేసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

కారు ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగళ్లు ద్వారకానగర్ వద్ద బుధవారం కారు ఢీకొని ఆటో డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఈ విషాదకర ఘటనకు సంబంధించి మృతుని కుటుంబ సభ్యులు ముదివేడు పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. తంబళ్లపల్లె మండలం, గోపిదిన్నె దళితవాడకు చెందిన మారెప్ప(45) మదనపల్లె అమ్మ చెరువు మిట్ట ఎసి గోడౌన్ ఎదురుగా ఉన్న కాలనీలో కాపురం ఉంటూ ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం స్కూల్ పిల్లల్ని ఆటోలో తీసుకుని కురబలకోట మండలంలోని అంగళ్లు లో ఉన్న ఇంజినీరింగ్ కళాశాల వద్ద వెళ్లాడు. విద్యార్థులను వదిలిపెట్టి తిరిగి ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యంలోని అంగళ్లు- మదనపల్లె రోడ్డు లోని ద్వారక కాలనీ వద్దకు ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మారెప్ప అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ : యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు

ప్రజాశక్తి-పీలేరు



జాహిద్ హుస్సేన్(ఫైల్ ఫొటో)

పీలేరు-కడప జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన పీలేరు మండలంలో చోటుచేసు కుంది. పీలేరు మండలం, కావలిపల్లె పంచాయతీ, పొంతలచెరువు క్రాస్ వద్ద బుధవారం చోటు చేసుకున్న సంఘటన వివరాలు ఇలావున్నాయి. కలకడకు చెందిన జావీద్ హుస్సేన్(28), సుహేల్(23) పీలేరు నుంచి ద్విచక్రవాహనంలో సొంతూరికి బయలుదేరారు. చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్‌పురం మండలం, ఎగువ ముద్దగుబ్బకు చెందిన అబ్దుల్(24) ద్విచక్రవాహనంలో కలకడ వైపు నుంచి పీలేరు వైపు వస్తుండగా ఇరు వాహనాలు పొంతలచెరువు క్రాస్ వద్ద ఎదురె దురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడడంతో 108 వాహనంలో పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జావీద్, సుహేలను మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గం మధ్యలో జాహిద్ హుస్సేన్ మృతి చెందాడు. పీలేరు ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.